ప్రజాశక్తి
మంగళవారం 12 ఆగస్టు 2025
5
పార్వతీపురం మన్యం

ఏరియా ఆసుపత్రికి రోగుల తాకిడి

ఒపి విభాగంలో కిక్కిరిసిన రోగులు

సీతంపేట : స్థానిక ఏరియా ఆసుపత్రికి సోమవారం రోగుల తాకిడి పెరిగింది. వైరల్, మలేరియా వంటి జ్వరాలతో రోగులు తాకిడి పెరిగింది. ఒపి 365 రాగా, ఇందులో జ్వరాలు 101 ఉన్నాయన్నారు. ఇన్ పేషెంట్లు 45 ఉన్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తెలిపారు. వీరికి వైద్య పరీక్షలు నిర్వహించారు.

కదం తొక్కిన ఆటో కార్మికులు

ఉచిత బస్సు పేరుతో పొట్ట కొట్టొద్దంటూ ఆందోళన
సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆదుకోవాలని డిమాండ్

పార్వతీపురంలో భారీ ర్యాలీ చేస్తున్న ఆటో కార్మికులు

ప్రజాశక్తి పార్వతీపురం టౌన్

జిల్లా కేంద్రంలో సోమవారం పార్వతీపురం, గరుగుబిల్లి, కొమరాడ, కురుపాం, జియ్యమ్మవలస, సీతానగరం మండలాలకు చెందిన వందలాది మంది ఆటో కార్మికులు పార్వతీపురం చేరుకొని, స్థానిక పాత బస్టాండ్ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు సిఐటియు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు, కార్యదర్శి బివి రమణ, కోశాధికారి గొర్లి వెంకటరమణ తదితరులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 15 నుంచి ఉచిత బస్సు పథకాన్ని అమలు చేస్తుందని, ఈ పథకం అమలైన తర్వాత ఆటో కార్మికుల్లో 60 శాతం మందికి ఉపాధిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక పథకం ప్రవేశపెట్టినప్పుడు దాని ప్రభావం ఎంతమందికి నష్టం జరుగుతుందో కూడా పరిశీలించి శాస్త్రీయంగా నష్టపరిహారాన్ని, ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఉపాధి లేక ఆటో కార్మికులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని ఈ నేపథ్యంలో ఉచిత బస్సు పథకం పెట్టిన తర్వాత ఇంకా ఆటో, టాక్సీ కార్మికుల పరిస్థితి దయనీయంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆటో కార్మికులను ఆదుకునేందుకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రతి నెలా పెన్షన్ చెల్లించాలని, వాహన మిత్ర తరహా పథకాన్ని ప్రవేశపెట్టి ప్రతి ఆటో, టాక్సీ డ్రైవర్లకు ఏడాదికి రూ.25 వేలు పరిహారం చెల్లించాలని, ఇప్పటికే వాహనాలపై తీసుకున్న రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఆటో, టాక్సీ డ్రైవర్లు, కార్మికుల సమస్యల పరిష్కారానికి నిర్దిష్టమైన కార్యాచరణ రూపొందించకపోతే సిఐటియు ఆధ్వర్యంలో ఆటో, టాక్సీ కార్మికులను ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు, సిఐటియు నాయకులు బి.సూరిబాబు, కె.సాంబమూర్తి, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు సంచాన ఉమామహేశ్వరరావు, ఆటో యూనియన్ నాయకులు సంబాన చిన్న, డి.రాము, క్రాంతి, నారాయణ, సత్యనారాయణ, జి.శ్రీను, శంకర్రావు, పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సాలూరురూరల్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్లను నిర్లక్ష్యానికి గురిచేసి వీధిన పడేస్తే డ్రైవర్లు చేసే పోరాటానికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆటో క్యాబ్ డ్రైవర్ల సంఘం గౌరవ అధ్యక్షులు (సిఐటియు) జిల్లా కార్యదర్శి ఎన్ వై నాయుడు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సోమవారం సాలూరులో గల ఆటో క్యాబ్ డ్రైవర్ల సంతకాల సేకరణ వివరాలను డిప్యూటీ తహశీల్దార్ కిరిటీకి సంఘం ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎన్ వై నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు పథకం వల్ల నష్టపోతున్న ఆటో క్యాబ్ డ్రైవర్లందరికీ వాహన మిత్ర పథకాన్ని అమలు చేసి ఒక్కొక్కరికి రూ.25 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆటో, క్యాబ్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించకపోతే పోరాటాలకు సిద్ధపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాంభద్రపురం జంక్షన్ ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు సిహెచ్ పవన్ కుమార్, వాకాడ హరి, మామిడిపల్లి జంక్షన్ ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు అప్పలరాజు, నర్సింగ్, జ్యోతిష్, సాలూరు-శంబర జంక్షన్ ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు సంతోష్ కుమార్, పిన్నింటి కేశవ, సోమేశ్, సాలూరు-మక్కువ జంక్షన్ ఆటో యూనియన్ నాయకులు గొర్ల రమేష్, మజ్జి అప్పారావు, సాలూరు-పాచిపెంట ఆటో యూనియన్ నాయకులు రమేష్, సాలూరు-తోణాం ఆటో యూనియన్ నాయకులు మణి, బోరబంద జంక్షన్ ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు కర్రి తౌడు తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ : ఆటో మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు రాష్ట్ర ప్రభుత్వం మహిళలతో ఉచిత బస్సు పథకం ప్రారంభించక ముందే వాహన మిత్ర పథకాన్ని ప్రకటించి ప్రతి డ్రైవర్‌కు రూ.25 వేలు చెల్లించేలా నిర్ణయం చేయాలని ఆటో క్యాబ్ డ్రైవర్ల యూనియన్ (సిఐటియు) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. తొలుత పాలకొండ పట్టణంలో ఆటో, క్యాబ్ డ్రైవర్ల సంఘం ఆధ్వర్యంలో దుర్గగుడి సెంటర్ నుంచి మెయిన్ రోడ్డు మీదుగా తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం తహశీల్దార్‌కు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ప్రవేశపెడుతున్నప్పుడు దానివల్ల నష్టపోతున్న డ్రైవర్ల సంక్షేమం మరిచిపోవడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు. ఎన్నికల ముందు హామీ ప్రకారం డ్రైవర్ల అందరికీ వాహన మిత్ర పథకం అమలు చేయాలని, డ్రైవర్ల మెడకు గురుతాడు లావు ఉన్న జిఒ 21ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్ల యూనియన్ అధ్యక్షులు కాదా రాము, నాయకులు పి.రాజశేఖర్, పి.మహేష్, పి రాము, ఎన్.సుదర్శనరావు, ఎస్.కామేష్, సంగమేషు, ఎన్.రాంబాబు, కె.ఎరుకరావు, సతీష్, డి.దుర్గారావు, వేణు, శ్రీనివాసు, పలువురు ఆటో కార్మికులు పాల్గొన్నారు.

పాలకొండలో ఆటో కార్మికుల ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు రమణారావు

నదిలో దిగి పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

ప్రమాదమని తెలిసినా.. తప్పని ప్రయాణం

ప్రజాశక్తి - కొమరాడ

ఈ సీజన్లో నదిలో ప్రయాణం చేయడం అందులో నడుచుకొని వెళ్లడం ప్రమాదకరమని తెలిసినా చదువుల కోసం తప్పని పరిస్థితుల్లో విద్యార్థులు నదిలో ప్రమాదకరంగా రాకపోకల సాధించాల్సిన దుస్థితి వారిది. కొమరాడ మండలంలోని నాగావళి నది అవతల వైపు ఉన్న కొట్టు తొడుము గ్రామానికి చెందిన విద్యార్థులు కొమరాడలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌కు చదువు కోసం రావాల్సి ఉంది. గతంలో నదిలో నీటి ప్రవాహం తక్కువగా ఉండడంతో నడుచుకొని వచ్చేవారు. ఇటీవల పడిన వర్షాలకు నీటి ప్రవాహం పెరిగిన సమయంలో పడవ సదుపాయం ఉండేది. ప్రస్తుతం వరద ఉధృతి స్వల్పంగా తగ్గడంతో పడవ నడిపేందుకు వీలు లేకపోవడంతో పడవను నడపడం లేదు. దీంతో నడుం లోతులో నీరు ప్రవహిస్తున్న ప్రమాదకర పరిస్థితిలో అక్కడ విద్యార్థులు నదిని దాటుకుని వచ్చి చదువు కోసం ప్రమాదకరంగా నడుచుకొని రావాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ ప్రాంతంలో నదిపై రాకపోకలు చేసేందుకు వంతెన అవసరం ఉన్నప్పటికీ వంతెన నిర్మాణం మధ్యలో నిలిచిపోవడంతో ఇక్కడ ప్రజలు, విద్యార్థులు అన్ని వర్గాల వారు రాకపోకలు చేసేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి ప్రజలకు అవసరమైన వంతెన నిర్మాణం పూర్తి చేసి నదిలో రాకపోకలు చేయకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సబ్ కలెక్టర్లుగా పవర్, వైశాలి

కలెక్టర్‌కు పూలమొక్కను అందజేస్తున్న పార్వతీపురం సబ్‌కలెక్టర్ వైశాలి

పార్వతీ పురం, పాలకొండ సబ్ కలెక్టర్లుగా వైశాలి, పవర్ స్వప్నిల్ జగన్నాథ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోబికను మర్యాద పూర్వకంగా వారు కలిశారు. ఇద్దరు సబ్ కలెక్టర్లు 2023 బ్యాచ్‌కు చెందిన ఐఎఎస్ అధికారులు. శిక్షణ పూర్తి చేసుకొని కొత్తగా పోస్టింగులను పొందారు.

కలెక్టర్‌కు పూలమొక్కను అందజేస్తున్న పాలకొండ సబ్‌కలెక్టర్ పవర్

అర్హులైన గిరిజనులందరికీ పోడు పట్టాలు

గిరిజన మహిళలనుద్దేశించి మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి - సాలూరురూరల్

అర్హులై తమ జీవనం కోసం సాగు చేసుకుంటున్న పోడు భూములకు ఈనెల 15 నాటికి ప్రతి గిరిజనులడికి పట్టాలు అందజేస్తామని రాష్ట్ర గిరిజన, స్త్రీ, శిశుసంక్షేమశాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన గిరిజనులు ఆమెతో మాట్లాడారు. తరతరాలుగా సాగు చేసుకొంటూ జీవనం సాగిస్తూ తమ జీవనాన్ని గడుపుకుంటూ కాలం గడుపుతున్నామని, కానీ ప్రభుత్వం అందజేసే సంక్షేమ పథకాలు పట్టాలు లేకపోవడంతో ఎటువంటి లబ్ధి చేకూరడం లేదని అన్నారు. తమ పోడు భూముల సమస్యలను వివరిస్తూ, తాము సాగు చేసుకుంటున్న ఈ పోడు భూములకు హక్కులు కల్పించేలా ప్రతి ఒక్కరికీ పట్టాలు ప్రభుత్వం అందజేసేలా కృషి చేయాలని మంత్రిని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. గిరిజనుల చెప్పిన సమస్యలను విన్న మంత్రి సంధ్యారాణి ఈ సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈనెల 15 నాటికి పోడు భూములు సాగు చేస్తున్న ప్రతి గిరిజనుడికి పట్టాలు అందజేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారని, ఈ మేరకు అర్హులైన ప్రతి గిరిజనుడికి పోడు పట్టాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సాలూరు మండల టిడిపి అధ్యక్షులు ఆముదాల పరమేష్, గిరిజన నాయకులు కోట లక్ష్మణరావు దొర, లక్ష్మణరావు, మండల టిడిపి నాయకులు మత్స శ్యామ్, బూస తౌడు, తిరుపతిరావు, భాస్కరరావు, వెంకటరమణ, వెంకటేష్ పాల్గొన్నారు.

వంద పడకల ఆసుపత్రి త్వరలో ప్రారంభం

సాలూరులో నిర్మాణంలో ఉన్న వంద పడకల ఆసుపత్రిని త్వరలోనే ప్రారంభించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. సోమవారం ఆమె ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులుతో కలిసి ఆసుపత్రిని సందర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆసుపత్రి నిర్మాణ పనుల్లో రాజీ లేకుండా అవసరమైన అన్ని రకాల వనరులను ప్రారంభ సమయానికి ముందుగానే చేయాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. ప్రజలకు ఆధునిక వైద్య సదుపాయాలు అందించడంలో ఈ హాస్పిటల్ కీలకపాత్ర పోషించనుందని, కాబట్టి నాణ్యత, సదుపాయాలు, పరిశుభ్రత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు. అనంతరం మున్సిపల్, రెవెన్యూ అధికారులతో సమావేశమై హాస్పిటల్ పరిసరాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, రహదారుల మరమ్మతులు, డ్రైనేజ్ సౌకర్యాలు, నీటి సరఫరా, విద్యుత్ కనెక్షన్ల వంటి అంశాలపై స్పష్టమైన సూచనలు అందించారు. మరికొద్ది రోజుల్లో దీన్ని ప్రజా ఆరోగ్య నిమిత్తం ప్రజలకు అందజేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, పట్టణ టిడిపి అధ్యక్షులు, ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ మీనాక్షి, ఆసుపత్రి వైద్యులు, రెవెన్యూ, విద్యుత్ శాఖ అధికారులు, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమశాఖ చీఫ్ ఇంజినీర్‌పై వేటు?

కేసుల మాఫీ వెనుక సూత్రధారులపై చర్యలేవీ?
భగ్గుమంటున్న గిరిజన సంఘాలు

ప్రజాశక్తి-పార్వతీపురం

గిరిజన సంక్షేమ శాఖ లో రూ.35 కోట్ల అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్ నుంచి ఐదు కోట్ల రూపాయలు లంచం డిమాండ్ చేసి అడ్వాన్స్‌గా 25 లక్షల రూపాయలు అందుకుంటూ ఎసిబి అధికారులకు పట్టుబడిన చీఫ్ ఇంజినీర్ ఎస్.శ్రీనివాస్ పై సస్పెన్షన్ వేటుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది. ఇప్పటికే చీఫ్ ఇంజినీర్ శ్రీనివాస్ జైలుకు వెళ్లడంతో తదుపరి చర్యలకు ప్రభుత్వం సిద్ధమైనట్లు తెలిసింది.కాంట్రాక్టర్ నుంచి చీఫ్ ఇంజనీర్ స్థాయి అధికారి నేరుగా ఐదు కోట్ల రూపాయలు డిమాండ్ చేయడం, రూ.25 లక్షలు జంకూ బొంకూ లేకుండా కార్యాలయంలోనే అందుకోవడం గిరిజన సంక్షేమ శాఖ లో సంచలనమైంది. గతంలో ఏ ప్రభుత్వం హయాంలోనూ ఓ ఉన్నతాధికారి ఈ స్థాయిలో బరితెగించి లంచం డిమాండ్ చేయడం చూడలేదనే చర్చ జరుగుతోంది.

గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ శాఖ లో ఎఇ స్థాయి నుంచి చీఫ్ ఇంజనీర్ స్థాయి వరకు ఎదగడంలో పాలక పార్టీ నాయకులతో వున్న సత్సంబంధాలే ఆయనకు బాగా దోహదపడ్డాయి. నీతివంతమైన, పారదర్శకమైన పాలన అందిస్తున్నామని పదే పదే చెప్పుతున్న అధికారపార్టీ నాయకులకు తాజా పరిణామం మింగుడు పడని అంశంగా తయారైంది. ఈ శాఖలో ఇప్పటికే గుమ్మలక్ష్మీపురం డివిజన్‌కు చెందిన ఇఇ, డిఇ, ఎఇలు ఫోర్జరీ కేసులో సస్పెన్షన్‌కు గురయ్యారు. ఎస్ఇ సంతకాన్ని ఫోర్జరీ చేశారనే ఆరోపణపై ఒకేసారి ముగ్గురు ఇంజినీర్లపై వేటు పడింది. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలినాళ్ళలో జరిగిన ఈ సంఘటన మరువకముందే రాష్ట్ర స్థాయిలో చీఫ్ ఇంజినీర్ శ్రీనివాస్ అవినీతి బాగోతం చర్చనీయాంశమవుతోంది. ఇంత పెద్ద అవినీతి పరుడైన సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్రీనివాస్‌ను చీఫ్ ఇంజినీర్ స్థానంలో కూర్చోబెట్టడంపైనా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల 25లక్షల రూపాయల లంచం తీసుకోవడానికి ముందు ఆయనపై రెండు ఎసిబి కేసులు నమోదయ్యాయి. ఒకటి ఎసిబి ట్రాప్ కేసు, మరొకటి లెక్క కు మించిన ఆస్తులకు సంబంధించిన కేసులు వున్నాయి. అయినా టిడిపి ప్రభుత్వం ఆయనను చీఫ్ ఇంజనీర్ స్థాయికి అందలమెక్కించింది. వాస్తవంగా ఆయన ఈనెలాఖరున ఉద్యోగ విరమణ చేయాల్సి ఉంది. అయితే మరో రెండు సంవత్సరాల పాటు ఆయనను చీఫ్ ఇంజినీర్ స్థానంలో లోనే వుంచాలని ఉత్తరాంధ్ర కు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు సిఫార్సు చేశారు. దీంతో ఆయన కూడా ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఆయన ఉద్యోగ కాలాన్ని పొడిగించాలంటే గతంలో వున్న రెండు కేసులు రద్దు చేయాల్సి ఉంటుంది. దీని కోసమే ఆయనపై ఉన్న పాత కేసులను మాఫీ చేస్తూ ప్రభుత్వం ఈఏడాది జులై 31న ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు వెలువడిన వెంటనే ఆయన తన ఉద్యోగ కాలం పొడిగింపునకు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది. ఈ మొత్తం ఎపిసోడ్ లో ప్రభుత్వం లోని ఇద్దరు కీలకమైన మంత్రులు సూత్రధారులు గా వ్యవహరించారనే ప్రచారం సాగుతోంది. కేసుల మాఫీ,ఉద్యోగ కాలం పొడిగింపునకు సంబంధించిన మంత్రులతో చీఫ్ ఇంజినీర్ శ్రీనివాస్ డీల్ కుదుర్చుకున్న తరువాతే కాంట్రాక్టర్‌కు 35 కోట్ల బిల్లు మంజూరు చేయడానికి 5కోట్ల లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం. అయితే ఈ వ్యవహారంలో చీఫ్ ఇంజినీర్ శ్రీనివాస్ పై ఎలాగూ చర్యలు తీసుకునే అవకాశం ఉంది. అయితే ఆయనతో డీల్ కుదుర్చుకున్న మంత్రుల పైనా చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

పిజిఆర్ఎస్‌కు 96 అర్జీలు

ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 96 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోబిక, డిఆర్ఒ కె.హేమలత, డిఆర్‌డిఎ పీడీ ఎం.సుధారాణితో కలిసి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారంలో ఏ ఒక్క అర్జీదారుడు అసంతృప్తి చెందకూడదని అన్నారు. అర్జీదారుని సౌకర్యం కొరకు కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో దాతల సహాయంతో ఉచిత భోజనం ఏర్పాటు చేశామని, ప్రతి అర్జీదారుడు భోజనం చేసి వెళ్లాలని సూచించారు. దాతలు ఎవరైనా ముందుకు వచ్చి ఈ ఉచిత భోజన కార్యక్రమంలో పాలు పంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఎస్‌పి గ్రీవెన్స్‌కు 5 ఫిర్యాదులు

పార్వతీపురం టౌన్ : ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 5 ఫిర్యాదులను స్వీకరించి, ఫిర్యాదుదారులతో మాట్లాడారు. సమస్యలను త్వరితగతిన పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్పీతో పాటు డిసిఆర్‌బి సిఐ సుధాకర్, ఎస్సై ఫ్రక్రుద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఐటిడిఎ గ్రీవెన్స్‌కు 39 వినతులు

సీతంపేట : స్థానిక ఐటిడిఎలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఎపిఒ జి.చిన్నబాబు సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గిరిజనులు తమ సమస్యలపై వినతి పత్రాలను సమర్పించారు. మొత్తం 39 మంది వినతి పత్రాలను సమర్పించారు. కార్యక్రమంలో ఇఇ కుమార్, డిడి అన్నదొర, డిప్యూటీ డిఇ రామ్మోహనరావు, ఉపాధి హామీ ఎపిడి శ్రీహరిరావు, వెలుగు ఎపిడి సన్యాసిరావు, పిహెచ్ఒ గణేష్, ఐటిడిఎ స్పోర్ట్స్ ఇన్‌ఛార్జ్ జాకబ్ దయానంద్, సిడిపిఒ సిమ్మలమ్మ, ఎఒ వాహిని, ఎంఎంఒ కోటిబాబు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల హక్కులను హరించే ఉత్తర్వులు రద్దు చేయాలి

ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎంలను నియమించాలి
ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్, ఆదివాసీ గిరిజన సంఘం, సిఐటియు, డివైఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పాఠశాల విద్యాశాఖ, ఇంటర్ బోర్డు పాఠశాల ఆవరణలోకి విద్యార్థి సంఘాల అనుమతి నిరాకరిస్తూ ఇచ్చిన ఉత్తర్వులు రద్దు చేయాలని స్థానిక గిరిజన భవనంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశిస్తూ నాయకులు మాట్లాడుతూ, ప్రభుత్వం తీసుకొచ్చిన ఉత్తర్వులు విద్యార్థుల హక్కులను కాలరాసేలా ఉన్నాయని, వెంటనే వాటిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయ పార్టీలకు, విద్యార్థి సంఘాలకు, ప్రజా సంఘాల వ్యత్యాసం ఉందని రెండింటినీ ఒకే గాటిన కట్టడం మంచిది కాదని అన్నారు. విద్యార్థి సంఘాలు విద్యార్థుల హక్కులకై నినదిస్తాయని తెలిపారు. ఎన్ఇపిలో భాగంగా విద్యా వ్యాపారాన్ని ప్రోత్సహించేలా ప్రభుత్వం ఉత్తర్వులు ఉన్నాయని తెలిపారు. గతం నుంచి విద్యార్థి, ప్రజా సంఘాలు గొంతునులుమేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని వాటికి ఇప్పటి వరకూ వ్యతిరేకిస్తూ విద్యార్థి ఉద్యమాలు నిర్వహించామని తెలిపారు. టిడిపి ప్రతిపక్షంలో ఉన్న సమయంలో నారా లోకేష్ విద్యార్థి సంఘాల పోరాటాలను ప్రోత్సహించారని, తీరా అధికారంలోకి వచ్చాక వెంటనే అదే సంఘాలపై నిబంధనలు విధించడం మాట మార్చడమేనిని తెలిపారు. తక్షణమే ఈ ఉత్తర్వులను రద్దు చేయకపోతే భవిష్యత్తులో తీవ్రమైన పరిణామాలు ప్రభుత్వం ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆశ్రమ పాఠశాలల్లో, సంక్షేమ హాస్టల్స్‌లో విద్యార్థులు అనారోగ్యంతో మరణిస్తుంటే ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదని, విద్యార్థులు ఆరోగ్యం పట్ల బాధ్యత వహించే వారు లేకపోవడం వల్లే ఇలా జరుగుతుందని, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి తాను బాధ్యత స్వీకరించిన తర్వాత మొదటి సంతకం ఎఎన్ఎంల నియామకంపై పెట్టానని చెప్పారు కానీ ఇంతవరకు నియమించకపోవడం బాధాకరమని అన్నారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బి.అనిల్, మండల కార్యదర్శి ఎ.గంగారావు, యుటిఎఫ్ మండల కార్యదర్శి శంకరరావు, చలపతి, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కోశాధికారి ఎం రమణ, సిఐటియు మండల సభ్యులు సన్యాసిరావు, యువజన సంఘం నాయకులు బి రమేష్ పాల్గొన్నారు.

రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న ప్రజాసంఘాల నాయకులు

పిఒల సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి - పార్వతీపురం

పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎ పిఒలుగానూ, సబ్ కలెక్టర్లు అశుతోష్ శ్రీవాస్తవ, సి యశ్వంత్ కుమార్ రెడ్డి సేవలు ప్రశంసనీయమని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ కొనియాడారు. బదిలీ అయిన ఇద్దరి అధికారులను సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్, జెసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇరువురి అధికారులు వారికి నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేశారన్నారు. ప్రతి అంశంపైన నిశితంగా చర్యలు చేపట్టారని ఆయన పేర్కొన్నారు. తమ పరిధిలో విస్తృతంగా పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకోవడం, వాటి పరిష్కారానికి మెరుగైన మార్గాలను అన్వేషించారని చెప్పారు. వైద్య, ఆరోగ్య, విద్యారంగాల్లో వారు ప్రత్యేకమైన చొరవ తీసుకున్నారని అన్నారు. జెసి ఎస్ ఎస్ శోబిక మాట్లాడుతూ ఇరువురి అధికారులు తమ పరిధిలో ఉత్తమ సేవలను అందించారని చెప్పారు. కార్యక్రమంలో డిఆర్ఒ కె.హేమలత, ఇపిడిసిఎల్ ఎస్ఇ కె మల్లికార్జున రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎస్.భాస్కర రావుతో పాటు పలువురు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతికి పాటుపడాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కురుపాం

రైతు అభ్యున్నతికి వ్యవసాయ పరపతి సహకార సంఘం ద్వారా కొత్తగా నియమించబడ్డ అధ్యక్షులు, డైరెక్టర్లు పాటుపడాలని స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. సోమవారం స్థానిక పిఎస్‌సిఎస్ కార్యాలయం వద్ద కొత్త అధ్యక్షులు ప్రమాణస్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని అధ్యక్షులుగా డొల్లు కిషోర్‌ను, డైరెక్టర్లుగా కర్రి సత్యంనాయుడు, తంగుడు సత్యనారాయణచే ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పిఎసిఎస్ ద్వారా రైతులకు అందుతున్న సేవలు సకాలంలో అందించేలా నూతన కమిటీ చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి వైరిచర్ల వీరేశ్ చంద్ర దేవ్, ఎఎంసీ చైర్మన్ కడ్రక కళావతి, మండల టిడిపి కన్వీనర్ కెవి కొండయ్య, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మహాదేవి వలసలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చలివేంద్రి సచివాలయం పరిధి మహాదేవివలసలో సోమవారం స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, మధుమేహ, రక్తపోటు, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ఓ శుభారతమణి, ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు, పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - కురుపాం

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. సోమవారం అన్నదాత సుఖీభవ లబ్ధి పొందిన రైతులు మూలిగూడ జంక్షన్ నుంచి కురుపాం ధూళికేశ్వర ఆలయం వరకు ట్రాక్టర్లతో నిర్వహించిన విజయోత్సవ ర్యాలీ, సభలో ముఖ్యఅతిథిగా ఆమె పాల్గొన్నారు. అనంతరం జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ రైతుకు ప్రభుత్వం ద్వారా అందాల్సిన రాయితీతో పాటు విత్తనం నాటి నుంచి దానికి ఎరువులు అందిస్తూ విక్రయిస్తూ 24 గంటల్లో రైతు ఖాతాల్లో నగదును జమ చేస్తూ రైతు పక్షపాతిగా ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్ర దేవ్, ఎఎంసి చైర్మన్ కడ్రక కళావతి, మండల కన్వీనర్ కెవి కొండయ్య, ఎఎంసి మాజీ చైర్మన్ కోలా రంజిత్ కుమార్, అరుకు పార్లమెంట్ బిసి సెల్ అధికార ప్రతినిధి దొంకాడ రామకృష్ణ, ట్రైకార్ బోర్డు మెంబర్ పువ్వల లావణ్య, కూటమి నాయకులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జిని కలిసిన ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - పాలకొండ

హైకోర్టు జడ్జిగా బాధ్యతలు చేపట్టిన గేదెల తుహిన్ కుమార్‌ను విజయవాడలో ఆయన స్వగృహంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పలు విషయాలు మాట్లాడారు. ఆయనతో పాటు వైస్ ఎంపిపి కనపాకసూర్య ప్రకాష్, గంగునాయుడు ఉన్నారు.

జడ్జిని సన్మానిస్తున ఎమ్మెల్యే విక్రాంత్

విద్యార్థులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక కోమటి వీధి మోడల్ ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు సోమవారం క్రీడా పోటీలు నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు రన్నింగ్, కబడ్డీ, తదితర రకాలైన క్రీడ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వీరఘట్టంలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రమైన వీరఘట్టంలో సోమవారం స్థానిక మేజర్ పంచాయతీ ఇఒ బి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. అంబేద్కర్ జంక్షన్ నుంచి నీటిపారుదల శాఖ కార్యాలయం వరకు రహదారికి ఇరువైపులా ఉన్న కాలువలో గత కొన్నేళ్లుగా పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని జెసిబి ద్వారా తొలగించారు.

ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టండి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరూ తిప్పి కొట్టాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కమిటీ సభ్యులు పి.సంగం పిలుపునిచ్చారు. సిపిఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఆగస్టు 9, 10, 11 వరకు దేశవ్యాప్త నిరసన కార్యక్రమంలో భాగంగా సోమవారం పార్వతీపురంలో నిరసన కార్యక్రమం కార్మికులతో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొంగ ఓట్లు వేయించుకుని గెలిచిన బిజెపి ప్రభుత్వం గద్దె దిగాలని, ఎస్ఐఆర్‌ను నిలిపివేయాలని, అక్రమంగా ఓట్లను చేర్చడాన్ని, తొలగించడాన్ని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అదానీతో ఒప్పందం కుదుర్చుకున్న స్మార్ట్ మీటర్ల విధానాన్ని విరమించుకోవాలని లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో భవన నిర్మాణ, ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు బుక్లెట్స్ పంపిణీ చేసిన ఎంఇఒ సూర్యదేముడు

విద్యార్థులకు ఎఫ్ఎ 1 పరీక్షలు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు అసైన్మెంట్స్ బుక్లెట్స్‌ను పంపిణీ చేసినట్లు ఎంఇఒ జిసూర్యదేవుడు సోమవారం తెలిపారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు ఎఫ్ఎ -వన్ పరీక్షలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎఫ్-ఎ వన్ఈ విద్యార్థుల సామర్థ్యాన్ని పెంచేందుకు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఆయా ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌తో పేదవాడికి నాణ్యమైన భోజనం

ప్రజశక్తి -కురుపాం

అన్న క్యాంటీన్ ద్వారా పేదవాడికి నాణ్యమైన భోజనం అందించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. సోమవారం కురుపాంలోని కోర్టు సమీపాన అన్న క్యాంటీన్ నిర్మాణానికి ముఖ్య అతిథిగా పాల్గొని కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాశ్వతంగా పేద, మధ్యతరగతి ప్రజలకు ఒక్కపూటైనా తక్కువ ధరకే నాణ్యమైన భోజనాన్ని అందించాలని లక్ష్యంతో స్థిరస్థాయిగా పక్కా బిల్డింగ్ నిర్మాణం చేపట్టి అందించడమైనది ముఖ్యమంత్రి గొప్ప ఆశయమని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్, మండల కన్వీనర్ కెవి కొండయ్య, ఎంపిడిఒ కెవై నాగభూషణరావు, తహశీల్దార్ కె.జయ, హౌసింగ్ ఎఇ జి. అచ్చయమ్మ తదితరులు పాల్గొన్నారు.

మితిమీరిన వేగంతో వెళ్తే చర్యలు

ప్రజాశక్తి - సీతంపేట

వాహనదారులు మితిమీరి వేగంతో వెళ్తే శాఖాపరమైన చర్యలు తప్పవని సీతంపేట ఎస్సై వై అమ్మనరావు హెచ్చరించారు. సోమవారం సీతంపేట సంత మార్కెట్లో ప్రజలకు, డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఓవర్ స్పీడ్‌తో వెళ్తే చర్యలు తీసుకుంటామన్నారు. అతివేగంగా ప్రయాణించడం వల్ల ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని అవగాహన కల్పించారు. కొండ దిగినప్పుడు వాహన చోదకులు సెల్ఫ్ ఆపకుండా ఇంజన్ స్టార్టింగ్‌లో గేర్ లోనే రావాలన్నారు. హెల్మెట్ తప్పనిసరిగా ఉండాలన్నారు రోడ్డు ప్రమాదంలో నివారణకు అందరూ సహకరించాలని కోరారు.

సీతానగరం : గుచ్చిమి జంక్షన్ లో సోమవారం స్థానిక ఎస్సై ఎం.రాజేష్ వాహనాలు తనిఖీలు నిర్వహించారు. అనంతరం వాహనదారులతో మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, దీనివల్ల వారికి ప్రాణానికి ఎంతో రక్షణ ఉంటుందని తెలిపారు. అంతేకాకుండా వారికి కుటుంబానికి రక్షణ అని అన్నారు. అలాగే గుర్తు తెలియని వ్యక్తుల నుంచి అనవసరమైన కాల్స్ వస్తే వాటిని తిరస్కరించాలన్నారు. వాట్సాప్ ల ద్వారా వచ్చే మెసేజ్‌లను గమనించాలని సైబర్ నేరాల పట్ల అవగాహన ఉండాలని సూచించారు. యువత మత్తు పదార్థాలకు బానిస కాకూడదని, ప్రతి ఇంటి యజమాని వారి పిల్లల పట్ల అవగాహన కలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, వాహనచోదకులు పాల్గొన్నారు.

ఘనంగా హర్‌ఘర్ తిరంగా ర్యాలీలు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులు, అధ్యాపకులు హర్ ఘర్ తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థినులు, అధ్యాపకులు ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి ర్యాలీలో జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పాల్గొన్నారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయడమే ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ముఖ్య ఉద్దేశ్యమని కలెక్టర్ అన్నారు. ఇది మన దేశం పట్ల మనకున్న ప్రేమని, ఐక్యతని తెలియజేస్తుందన్నారు. ఆగస్టు 13 నుండి 15 వరకు నిర్వహించే హర్ ఘర్ తిరంగా ర్యాలీలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. అలాగే ఇళ్లు, కార్యాలయాలు, వాహనాలపై త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించాలని, జాతీయ జెండాతో సెల్ఫీ తీసుకుని వారి వాట్సాప్ స్టేటస్ ల్లో పెట్టుకోవాలని సూచించారు. ర్యాలీలో డిఆర్ఒ కె.హేమలత, ప్రభుత్వ కళాశాల విద్యార్థిని విద్యార్థులు, ప్రిన్సిపల్, అధ్యాపకులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : పట్టణంలోని మున్సిపల్ కమిషనర్ టి.రత్న కుమార్, మున్సిపల్ డిఇ బివి ప్రసాద్, శానిటరీ ఇన్స్పెక్టర్ ఎల్.బాలకృష్ణ ఆధ్వర్యంలో స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా హర్ ఘర్ తిరంగా ప్రచారం నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి బోసు బొమ్మ వరకు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ "ఆజాదీ కా అమృత్ మహోత్సవ్"లో భాగంగా, ప్రజల్లో దేశభక్తిని పెంపొందించడం, జాతీయ జెండాతో వారి సంబంధాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసేలా ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ ప్రచార ర్యాలీని నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సెక్రెటరీలు పాల్గొన్నారు.

పార్వతీపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

కురుపాం : భారత జాతి గౌరవం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎం.కుమారస్వామి విద్యార్థులకు పిలుపునిచ్చారు. సోమవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతి గౌరవం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేస్తూ మన దేశాన్ని మన జాతీయ జెండాన్ని గౌరవాన్ని నిలబెట్టి దేశభక్తి కలిగి ఉండలని అన్నారు. కార్యక్రమంలో ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం అధికారులు ఎ.రామ్మోహన్, రమేష్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే గిరిజనాభివృద్ధి : మంత్రి

ప్రజాశక్తి - సాలూరురూరల్

వెనుకబడిన ప్రాంతాలు, గిరిజనలకు సంపూర్ణమైన అభివృద్ధి కూటమి ప్రభుత్వంలోనే జరుగుతాదని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖామంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో గత వైసిపి ప్రభుత్వంలో గిరిజనులకు రావాల్సిన సబ్ ప్లాన్ నిధులు గానీ, గిరిజన సంక్షేమ శాఖ నుంచి ట్రైకార్ రుణాలు గానీ, వ్యవసాయ పరికరాలు గానీ ఎటువంటి గిరిజనులకు లబ్ధి చేకూర్చే పథకాలను నిర్వహించలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గిరిజనులకు కావాల్సిన అన్ని రకాల మౌలిక సదుపాయాలను ఇవ్వడానికి ముఖ్యమంత్రి సిద్ధంగా ఉందన్నారు. ఇందులో భాగంగానే ప్రపంచ ఆదివాసీ దినోత్సవ సందర్భంగా పాడేరులో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక గిరిజనులకు కావాల్సిన అన్ని రకాల పథకాలను వరాల రూపంలో ప్రకటించారని అన్నారు.

గిరిజన యూనివర్సిటీని ఎందుకు మార్చారు?

విజయనగరం జిల్లా కొత్తవలస వద్ద గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు అప్పటి టిడిపి ప్రభుత్వం పునాదులు వేసి, కొంత డబ్బులు కూడా ఖర్చు చేసిందని, కానీ 2019లో వచ్చిన వైసిపి ప్రభుత్వం అక్కడ నిర్మించకుండా మెంటాడలో నిర్మించడానికి కారణం ఏమిటని ఆమె వైసీపీ నాయకులు ప్రశ్నించారు. గిరిజన ప్రాంతంలో అదానీకి హైడ్రో పంపుడు స్టోరేజ్ ప్రాజెక్టుకు అనుమతులు ఇచ్చింది ఎవరని ఆమె వైసీపీ నాయకులను ప్రశ్నించారు. అదానీ కంపెనీ ఒత్తిడికి తలొగ్గి, ఆ కంపెనీని అమాయకమైన గిరిజన ప్రాంతంలో నెలకొల్పడానికి అనుమతులన్నీ ఇచ్చి అనుమతులు రద్దు చేసిన టిడిపి ప్రభుత్వాన్ని ప్రశ్నించడమేమిటని ఆమె వైసీపీ నాయకులు ప్రశ్నించారు. అనంతరం జీగిరాంలో 15 కుటుంబాలు టిడిపిలో చేరాయి. కార్యక్రమంలో సాలూరు పట్టణ, మండల మక్కువ, పాచిపెంట మండలాల టిడిపి అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, ఆముదాల పరమేష్, గుల్ల వేణుగోపాలనాయుడు, గూడెపు యుగంధర్, నాయకులు బూన తౌడు, కూనిశెట్టి భీమ, కేతిరెడ్డి చంద్రశేఖర్, మత్స శ్యామ్, భాస్కరరావు, హర్ష, పప్పల మోహన్‌రావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థుల ప్రాణాలు కాపాడండి

గిరిజన సంక్షేమ ముఖ్య కార్యదర్శికి వినతి

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో, వసతి గృహల్లో గతంలో పనిచేసిన ఆదివాసీ ఆరోగ్యం సిబ్బందిని నియమించి గిరిజన విద్యార్థుల ప్రాణాలు కాపాడాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్షులు పాలక రంజిత్ కుమార్ అమరావతి సచివాలయంలో గిరిజన సంక్షేమ ముఖ్య కార్యదర్శి ఎంఎం నాయక్‌కు వినతిపత్రం అందించినట్లు తెలిపారు. గురుకుల, ఏకలవ్య, కస్తూరిబా, జ్యోతిరావు పూలే విద్యా సంస్థల్లో ఎఎన్ఎంలు ఉన్నారని, ఒక్క గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో, వసతి గృహల్లోనే వైద్య సిబ్బంది లేరని వివరించారు. దీంతో ప్రతిఏటా గిరిజన విద్యార్థులు మృతి చెందుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎ పిఒలను కొనసాగించాలని, పాలక వర్గ సమావేశాలు ఏర్పాటు చేసి గిరిజన సంక్షేమ, ఉపాధి అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన విద్యార్థి సంఘం, గిరిజన అభ్యుదయ సంఘం నాయకులు పల్ల సురేష్, ఆరిక చంద్ర శేఖర్, గణేష్, శ్రీ రంజని, సుభాషిణి, నిర్మల, సత్యవతి, సంతోషి ఉన్నారు.

పాఠశాల వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు

రెగ్యులర్ ఉపాధ్యాయుడ్ని నియమించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని దుడ్డుఖల్లు పంచాయతీ కొత్తవలస గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలో రెగ్యులర్ ఉపాధ్యాయుడ్ని తక్షణమే నియమించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం పాఠశాల ముందు యువజన నాయకులు నిమ్మక ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పాఠశాలలో రెగ్యులర్ ఉపాధ్యాయుడు లేకపోవడంతో విద్యార్థుల విద్యా ప్రగతి దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో మాదిరిగానే పాఠశాలలో నాలుగో తరగతి వరకు తరగతులు కొనసాగించాలని, ఐదో తరగతికి అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. తమ గ్రామానికి చెందిన నాలుగో తరగతి విద్యార్థులు ప్రతిరోజూ రెండు కిలోమీటర్లు నడిచి పక్క గ్రామమైన దుడ్డుఖల్లుకు వెళ్ళి చదువుకోవాల్సి వస్తోందని, ఈ సమస్యను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఆందోళనలో మాజీ సర్పంచ్ నిమ్మక కంశాలమ్మ, కడ్రక రాంబాబు, తల్లిదండ్రులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సిపిఐ నుంచి జీవ, సూరయ్య బహిష్కరణ

ప్రజాశక్తి పార్వతీపురం టౌన్.

సిపిఐ నుంచి తోట జీవ, గరుగుబిల్లి సూరయ్యను బహిష్కరిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కోరంగి మన్మధరావు తెలిపారు. సిపిఐ సమావేశం స్థానిక ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో మన్మధరావు మాట్లాడుతూ, ఈనెల 8,9 మన్యం జిల్లా రెండవ జిల్లా మహాసభలను పాలకొండలో నిర్వహించామన్నారు. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించామన్నారు. అనంతరం 29మందితో కూడిన జిల్లా నూతన సమితి సభ్యులను, 7 కార్యవర్గాన్ని కూడా ఎన్నుకున్నట్లు తెలిపారు. జిల్లా మహాసభ ప్రతినిధుల సమావేశంలో పార్టీ నిబంధనలకు, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న జిల్లా కార్యవర్గ సభ్యులు తోట జీవ, గరుగుబిల్లి సూరయ్య ను పార్టీ నుండి బహిష్కరిస్తున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు. ఇకపై వారు చేసిన ఏ కార్యక్రమాలకు పార్టీకి ఎటువంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బుడితి అప్పలనాయుడు, ఇవి నాయుడు, కూరంగి గోపి నాయుడు, ఆర్వీఎస్ కుమార్, మండంగి నీలమ్మ, జిల్లా సమితి సభ్యులు సింహాద్రి దుర్గారావు, పువ్వల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా నూతన కార్యవర్గం :

జిల్లా కార్యదర్శిగా కూరంగి మన్మధరావు, జిల్లా కార్యవర్గ సభ్యులుగా బుడితి అప్పలనాయుడు, కుండంగి లింగరాజు, ఈ.వి నాయుడు, కూరంగి గోపినాయుడు, ఆర్వీఎస్ కుమార్, మండంగి నీలమ్మ జిల్లా సమితి సభ్యులుగా మండంగి సుశీల, మండంగి గోపాల్, కూరంగి జగదీష్, ద్వారపూడి అప్పలనాయుడు, సింహాద్రి దుర్గారావు, సాలాపు అనంతరావు, ఆర్. దుర్గాప్రసాద్, బిడ్డిక బంగారు, సింహాద్రి కిరణ్ కుమార్, మర్రి సీతారాం దొర, గుజ్జ జనార్ధన్, పువ్వల ప్రసాద్, బి.టి నాయుడు, కొరపాం త్రినాథరావు, యు. పైడిశెట్టి, మండంగి రాజేష్, బొత్స మోహన్ రావు, బలగ రాధ, బి. రవి, బిడ్డిక సూర్యం, నిమ్మల చిన్నారావు, తాడంగి అన్నాజీరావులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని తెలియజేశారు.

గ్రామస్తులకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న వైసిపి నాయకులు

రాజన్నగూడలో బాబు ష్యూరిటీ... మోసం గ్యారెంటీ

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని సోమగండి పంచాయతీ రాజన్నగూడలో వైసిపి నాయకులు బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి ప్రజా సంక్షేమం పట్టడం లేదని విమర్శించారు. గ్రామాల్లో అనేక సమస్యలు రాజ్యమేలుతున్నాయన్నారు. ఇప్పటికే సంక్షేమ పథకాలు అందడం లేదని గిరిజనులు వాపోయారు. సంక్షేమం కేవలం వైసీపీతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో జిల్లా కో-ఆప్షన్ సభ్యులు ఎస్.లక్ష్మి, ఎంపిటిసి సభ్యులు చంద్రశేఖర్, పాలకొండ నియోజకవర్గం వైసిపి ఎస్టీ సెల్ కన్వీనర్ నిమ్మక కాంతారావు, సర్పంచ్ సవర రుతోని, మండల ఎస్టీ సెల్ కన్వీనర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బయో రిసోర్స్ కేంద్రాలు బలోపేతం : డిపిఎం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

బయో రిసోర్స్ కేంద్రాలు బలోపేతం కావాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రబంధకులు ఎం.శ్రావణ్‌కుమార్ నాయుడు అన్నారు. మండలంలోని తోటపల్లి జట్టు ట్రస్ట్ నూతన కార్యాలయ ప్రాంగణంలో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన 40 మంది బయో రీసోర్స్ కేంద్రాల యజమానులు, రైతులకు బయో ఇన్పుట్స్ తయారీపై నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు సోమవారం జ్యోతి ప్రజ్వలన చేసి జట్టు వ్యవస్థాపకులు డాక్టర్ డి.పారినాయుడు అధ్యక్షతన శిక్షణ ఇచ్చారు. తొలుత పారినాయుడు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేయడానికి రిసోర్స్ కేంద్రాల్లో పూర్తిస్థాయిలో వనరులు అందుబాటులో ఉన్నచో రైతులు పూర్తి స్థాయి విస్తీర్ణంలో ప్రకృతి సాగు చేయడానికి అవకాశం కలుగుతుందని అన్నారు. ఈ శిక్షణలో నేర్చుకున్న అంశాలు వారి కేంద్రాల్లోనూ, రైతులతో ఆచరించేటట్లు చేయాలని సూచించారు. డిపిఎం శ్రావణ్‌కుమార్ నాయుడు మాట్లాడుతూ నిరంతర పంటలు, ఆదాయం, ఆరోగ్యం పొందాలంటే బయో రీసోర్స్ కేంద్రాల పాత్ర ప్రముఖమైనవి అన్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు ప్రతి రోజు అందుబాటులో రీసోర్స్ కేంద్రాల్లోని అన్ని రకాల జీవామృతాలు, కషాయాలు, ద్రావణాలు, టానిక్‌లు, పంచగవ్య, వ్యవసాయ పనిముట్లు, ఇతర రకాలు అందుబాటులో ఉండి సరసమైన ధరలకు లభ్యమైనచో రైతులు సద్వినియోగం చేసుకొని పూర్తి విస్తీర్ణంలో ప్రకృతి సాగుకు అవకాశం ఉంటుందన్నారు. దీని ద్వారా ఆరోగ్యకరమైన పంటలు పండించుకుని ఇటు ఉత్పత్తిదారులకు అటు వినియోగదారులకు బహుళ ప్రయోజనం కలగడంతో పాటు ఆనందకరమైన జీవితాలు పొందవచ్చని తెలిపారు. బయో రిసోర్స్ కేంద్రాలు బలోపేతమైతే స్థానిక,పరిసర గ్రామ రైతులు సీజన్ల వారీగా పంటలు పండించుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి అవకాశం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో స్టేట్ కన్సల్టెంట్ ప్రవీణ్‌కుమార్, రమాప్రభ, ఎన్ఎఫ్ఎ ట్రైనర్లు సిహెచ్ రవికుమార్, బి.శంకర్రావు, పాపారావు, మాస్టర్‌ట్రైనర్లు, రైతులు పాల్గొన్నారు.

బయో గ్రామాలపై సమీక్ష

అనంతరం కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాలకు చెందిన ప్రకతి వ్యవసాయ యూనిట్ ఇన్చార్జిలతో జట్టు వ్యవస్థాపకులు డాక్టర్ డి.పారినాయుడు అధ్యక్షతన బయో గ్రామాలపై సమీక్షించారు. 2018లో కురుపాం మండలంలోని కొండ బారిడిలో 72మంది రైతులు 242 ఎకరాల్లో నవ ధాన్యాలు, జీవామృతాలను ఉపయోగించుకుని పంటలు పండించుకున్నారు. ఇందుకు గానూ కోవడం జరిగినదని అప్పుడు ఆ గ్రామాన్ని అప్పటి ప్రిన్సిపల్ సెక్రటరీ బి.రాజశేఖర్ రాష్ట్రంలో మొట్టమొదటి బయోగ్రామంగా ప్రకటించారు. ఈ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకొని మిగతా గ్రామాలను బయో గ్రామాలుగా మార్చడానికి ప్రకృతి వ్యవసాయ విభాగంతో పాటు జట్టు ట్రస్టు విశేషమైన కృషి చేసింది. ఈ సందర్భంగా డిపిఎం ఎం.శ్రావణ్ కుమార్ నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో మన్యం జిల్లాకు ఒక ప్రత్యేక గుర్తింపు ప్రకృతి వ్యవసాయం ద్వారా వచ్చిందన్నారు. నీతి అయోగ్ కూడా మన జిల్లాను ప్రకృతి వ్యవసాయ ఆశాజనక జిల్లాగా ఎంపిక చేయడం గర్వకారణంగా ఉందని అందుకు ప్రతి కార్యకర్త రైతులకు అందుబాటులో ఉండి వారు ప్రకృతికి హాని చేసే ఏ విధమైన విష పదార్థాలు ఉపయోగించకుండా, సహజ పంటలు పండించుకొని ప్రకతిని, భూమాతను, సకల జీవరాసులను, అందరి ఆరోగ్యాలను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. గుమ్మ లక్ష్మీపురం మండలాన్ని మోడల్ మండలంగా ఎంపిక చేశామన్నారు. జిల్లాలో ఎక్కువ గ్రామాలు బయో గ్రామాలుగా మార్చడానికి ప్రణాళికలు తయారు చేసి అందరి సహకారంతో ఆచరించడానికి ప్రయత్నించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జట్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్ ప్రహరాజ్, స్టేట్ కన్సల్టెంట్ రమాప్రభ, ప్రవీణ్ కుమార్, సిలబస్ కన్సల్టెంట్ టి. శివాజీ, జట్టు సిబ్బంది యూనిట్ ఇన్చార్జిలు పాల్గొన్నారు.

శిక్షణలో మాట్లాడుతున్న డిపిఎం శ్రావణ్‌కుమార్ నాయుడు

సాగునీరు విడుదల చేసి రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - కొమరాడ

జంఝావతి రిజర్వాయర్‌కు సంబంధించి ఎత్తిపోతల పథకం ద్వారా వెంటనే సాగునీరు విడుదల చేసి రైతుల పొలాలకు నీరందించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో గిరిజన రైతులతో కలిసి డంగభద్రలో సోమవారం నిరసన చేపట్టారు. ఈ సంద్భంగా ఆయన మాట్లాడుతూ ఎత్తిపోతల పథకం ద్వారా 820 ఎకరాలకు సాగునీరందించడానికి ఇరిగేషన్ అధికారులు కరెంటు లేదని, ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేస్తామని చెప్పడమే తప్ప నీరు విడుదల చేసి పొలాలకు అందించని పరిస్థితి ఉందని అన్నారు. గతంలో పాడైన ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేయడానికి ఇరిగేషన్ అధికారుల వద్ద డబ్బుల్లేవా అని ప్రశ్నించారు. ఎత్తిపోతల పథకం ద్వారా నీరందించడంలో ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం తగదని అన్నారు. అలాగే ఒడిశాలో కూటమి ప్రభుత్వం ఉన్నందున వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రధానమంత్రితో సంప్రదించి జంఝావతి రిజర్వాయర్ పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. సమస్యలన్నీ పరిష్కరించి, జంఝావతి రిజర్వాయర్ పూర్తిచేసి 24,640 ఎకరాలకు సాగునీరందించి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు రామారావు, బలరాం, వెంకటేశు, ధర్మారావు, సన్యాసిరావు, పాపారావు, మల్లేష్, రైతులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న రైతులు

కాలువల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

చినుకు పడితే చాలు పార్వతీపురం పట్టణ మెయిన్ రోడ్డు చెరువు అవుతోందని, కావున ఈ సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వి. దాలినాయుడు, కోలా కిరణ్, మండల అధ్యక్షులు తీళ్ళ గౌరీ శంకరరావు తదితరులు జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభికకు పట్టణ మెయిన్ రోడ్డు సమస్య గూర్చి చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏమాత్రం వర్షం పడ్డా పట్టణ మెయిన్ రోడ్డు చెరువుగా మారుతుందన్నారు. స్మార్ట్ బజార్ జంక్షన్ నుండి సారికి వీధి జంక్షన్ వరకు ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్ తదితర ప్రాంతాలన్నీ జలమయం అవుతున్నాయన్నారు. వర్షం నీరు మురుగు కాలువలో ప్రవహించకపోవడంతో ఆ నీరంతా రోడ్డుపైకి వచ్చి సుమారు మూడు నాలుగు అడుగులు మేరకు నిల్వ ఉండడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతుందన్నారు. మురుగు కాలువల్లో పూడికి తీత పనులు చేపట్టకుపోవడంతో పాటు కాలువలు ఆక్రమణకు గురికావడం వల్ల వర్షపు నీరు ప్రవహించేందుకు వీలు లేక ఆ నీరు రోడ్డు పైకి వస్తుందన్నారు. దీనివల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాబట్టి ప్రజల ఇబ్బందులను పరిగణలోకి తీసుకొని, వర్షపు నీరు రోడ్డు పైకి రాకుండా, పట్టణ ప్రధాన రోడ్డులో కాలువల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

డిటికి వినతిని అందజేస్తున్న రైతులు

రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

సాగులో ఉన్న రైతులకు పట్టాలివ్వకుండా సాగు చేయనని రైతులకు పట్టాలు ఇప్పించిన రెవెన్యూ అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, వీరిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, సాగులో ఉన్న వారందరికీ పట్టాలివ్వాలని మండలంలోని నెలిపర్తి గ్రామానికి చెందిన దళిత రైతులు సోమవారం స్థానిక తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు బొంగ కృష్ణ, గొండేల మురళి మాట్లాడుతూ మా తాత తండ్రుల నుండి సుమారు 40 కుటుంబాలు తమ గ్రామ సమీపంలో గల ప్రభుత్వ భూమిని సాగు చేస్తూ జీవిస్తున్నామని, ఇటీవల కాలంలో కలెక్టర్ ఫిర్యాదుల విభాగంలో పట్టాలు ఇవ్వాలని వినతిని ఇచ్చామన్నారు. అయితే స్థానిక విఆర్ఒ తమ వద్దకు వచ్చి పట్టాలు ఇస్తామని మీరే సాగులో ఉన్నారని సర్వేలు చేస్తామని నమ్మబలికి వాస్తవానికి విరుద్ధంగా కలెక్టర్‌కు నివేదిక ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నివేదికలో నెలిపర్తికి చెందిన దళితుల సాగులో లేరని చెప్పి పాచిపెంట మండలం విశ్వనాథపురం గ్రామానికి చెందిన కొంతమంది పెత్తందారులకు, భూస్వాములకు పట్టాలు ఇచ్చారని తెలిపారు. పెత్తందారులకు, భూస్వాములకు అనుకూలంగా నివేదిక ఇవ్వడం సరికాదని, విఆర్ఒ ఇచ్చిన నివేదికను రద్దు చేసి జిల్లా ఉన్నతాధికారులు సమగ్రవిచారణ చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. తప్పుడు నివేదిక ఇచ్చిన నెలిపర్తి వీఆర్వో వంశీకృష్ణపైనా, రెవెన్యూ పరిశీ లకుల పైన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత రైతులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండల పరిధిలో దళాయి వలస జంక్షన్ వద్ద మోటారు సైకిల్ తో మద్యం బాటిళ్లు తరలిస్తున్నటువంటి దిలీప్ కుమార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. దిలీస్‌కుమార్ నుండి 35 మద్యం బాటిల్లను, అలాగే మోటార్ సైకిల్ తో స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ రమేష్‌నాయుడు తెలిపారు. అక్రమంగా మద్యం సీసాలను తరలిస్తున్నటువంటి వ్యక్తిపై కేసును నమోదు చేసి, అరెస్ట్ చేసినట్టు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.